ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
7



శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 2 అక్టోబరు 2025

3, 4 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్, ఎంసీఏ, ఎంబీఏ కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 3, 4 తేదీల్లో తక్షణ ప్రవేశాలు (స్పాట్ అడ్మిషన్లు) నిర్వహించనున్నట్టు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్ధేశించిన కేటగిరీల వారీగా సీట్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఏపీ ఈఏపీసెట్, ఐసెట్ రాసిన అభ్యర్థులకు తొలి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇంకా సీట్లు మిగిలి ఉంటే సెట్ రాయనివారికి కూడా కేటాయిస్తామని అన్నారు.

దసరా సందడి

● పండుగకు సిద్ధమైన జిల్లావాసులు ● కళకళలాడిన మార్కెట్లు




ఆకట్టుకున్న సైకతశిల్పం

ఆమదాలవలస, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): విజయదశమి.. అందరి జీవితాల్లో విజయం నింపాలని ఆకాంక్షిస్తూ గాజులకొల్లివలస గ్రామానికి చెందిన సైకత శిల్పి గేదెల హరికృష్ణ రూపొందించిన దుర్గాభవానీ అమ్మవారి సైకత శిల్పం విశేషంగా ఆకట్టుకుంది. బుధవారం గాజులకొల్లివలస సంగమేశ్వరాలయం ప్రాంగణంలో ఈ సైకత శిల్పం రూపొందించారు. చూసేందుకు స్థానికులు ఆసక్తి కనబరిచారు.



పూలు కొనుగోలు చేస్తూ..

గుజరాతీపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరాను గురువారం నిర్వహించేందుకు జిల్లా ప్రజలు సన్నద్ధమయ్యారు. గురువారం పండుగ చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి పూజకు అవసరమైన సామాగ్రి, ఇతర వస్తువుల కొనుగోలుకు బుధవారం మార్కెట్లకు పోటెత్తారు. ఉదయం నుంచి పెద్ద మార్కెట్, రైతు బజార్‌తోపాటు జీటీ రోడ్డు, పాలకొండ రోడ్డు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి. పండ్లు, కొబ్బరికాయల ధరలు కూడా అమాంతం పెంచేసినట్టు కొనుగోలుదారులు చెబుతున్నారు. వస్త్ర, బంగారు దుకాణాలు కిటకిటలాడాయి. బైక్, టీవీ, ఫ్రిజ్, సెల్ తదితర షాపులతో పాటు స్వీట్ల దుకాణాలు వినియోగదారులతో రద్దీగా మారాయి.



కిరణాల వెలుగులో స్వామివారు

ఆదిత్యుని తాకిన సూర్యకిరణాలు

అరసవల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సూర్యనారాయణ స్వామివారిని భానుడి లేలేత కిరణాలు బుధవారం తాకాయి. ఉదయం 6 గంటలకు కిరణాలు ఆలయ ముఖద్వారం గుండా పయనించి, అనివెట్టి మండపం మీదుగా నేరుగా గర్భాలయంలోని స్వామివారి పాదాలను స్పృశించాయి. దీంతో ఆదిత్యుడు బంగారు వర్ణంలో మెరిసిపోయారు. ఈ సుందర దృశ్యాన్ని చూసి భక్తులు పులకించిపోయారు. గురువారం కూడా స్వామివారిని కిరణాలు తాకనున్నాయని ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ తెలిపారు.



ప్లాస్టిక్ పూలదండలను కొనుగోలు చేస్తున్న దృశ్యం



కొనుగోలుదారులతో కిక్కిరిసిన శ్రీకాకుళం ప్రధాన మార్కెట్

శుద్ధజల కేంద్రాలు తెరిచేదెప్పుడు?

● గత వైసీపీ సర్కారు హయాంలో మూతపడిన 135 ప్లాంట్లు
● వినియోగంలోకి తెస్తామన్న కూటమి ప్రభుత్వం
● మూడు నెలల కిందట రూ.5.75 కోట్లు కేటాయింపు
● ఇప్పటికీ విడుదల కాని నిధులు



కవిటిలో ట్యాంకులు ఇలా..

ఇచ్ఛాపురం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో మూతపడిన 135 శుద్ధజల కేంద్రాలను తెరుస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది. వీటికోసం రూ.5.75 కోట్లను కేటాయించింది. నిధుల విడుదలకు ఈ ఏడాది జూన్‌లో కేబినెట్ ఆమోదం తెలిపింది. కానీ, ఇంతవరకూ నిధులు రాకపోవడంతో శుద్ధ జల కేంద్రాలు తెరుచుకోలేదు. దీంతో రెండు నియోజకవర్గాల్లోని వందలాది గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.

ఇదీ పరిస్థితి..

ఉద్దానంలో కిడ్నీ వ్యాధులకు తాగునీరు కలుషితం కావడం ఒక కారణమని అధ్యయనాలు తేల్చాయి. దీంతో 2018లో టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ సుజలధార పథకాన్ని ప్రారంభించింది. అప్పట్లో ఈ పథకం కుప్పం నియోజకవర్గానికి కేటాయించాల్సి ఉంది. కానీ, నాడు మంత్రిగా ఉన్న లోకేశ్ ప్రత్యేక చొరవతో ఉద్దానంలో రూ.14 కోట్ల వ్యయంతో శుద్ధ జలాల ప్లాంట్లను అధికారులు ఏర్పాటు చేశారు. పలాస, వజ్రపుకొత్తూరు, మందస (మిగతా 8వ పేజీలో..)



కవిటి మండలం కొలికాన పుట్టుగలో నిరుపయోగంగా ఎన్టీఆర్ సుజలధార ట్యాంక్

జిల్లాకు భారీ వర్ష సూచన

● యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రానున్న రెండు రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ మేరకు బుధవారం సాయంత్రం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జిల్లా అధికార యంత్రాంగంతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వంశధార, నాగావళి నదీ తీర పరివాహక ప్రాంతాల్లో వరద ముప్పు పొంచి ఉందని అన్నారు. ఈ నదుల్లోని నీటిమట్టాలు శుక్రవారం ప్రమాదకర స్థాయిని దాటే అవకాశం ఉందని, మూడో ప్రమాదకర స్థాయికి చేరితే శ్రీకాకుళం, గార, కొత్తూరు, పోలాకి, జలుమూరు, నరసన్నపేట మండలాల్లోని సుమారు 48 గ్రామాలు తీవ్రంగా ప్రభావితమవుతాయని అన్నారు. నాగావళి పరివాహక ప్రాంతాలైన ఆముదాలవలస, ఎచ్చెర్ల, బూర్జ మండలాల్లోని 11 గ్రామాలకు ముంపు హెచ్చరిక ఉండవచ్చని తెలిపారు. యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు, నదీతీర ప్రాంతాల్లోని ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చూడాలని, రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులు వారికి కేటాయించిన స్థానాల్లో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ప్రజలు అత్యవసర సమయంలో 08942-240557 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. సహాయక బృందాలు విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు.

తాగునీటి సరఫరా బాధ్యత అధికారులదే

● పారిశుధ్యం మెరుగుపర్చాలి
● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
● కవిటి పంచాయతీరాజ్ ఏఈకి చార్జిమెమో

కవిటి, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. కవిటి మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో కలిసి ఇచ్ఛాపురం నియోజకవర్గ స్థాయి అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఉద్దానం, ఆర్‌డబ్ల్యూఎస్ పథకాలను మెగా కంపెనీలో విలీనం చేసిన తర్వాత సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఎమ్మెల్యే అశోక్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రతీ సెక్షన్‌కు ఒక్కో అధికారి అజమాయిషీగా ఉండడంతో పాటు వారిమధ్య సమన్వయం లేకపోవడం ఇబ్బందికరంగా మారిందన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ.. రెండువారాల్లో నీటిసరఫరా మెరుగుపడాలని, లేదంటే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. సమీక్షకు కవిటి పంచాయతీరాజ్ ఏఈ ప్రవీణ్ హాజరుకాకపోవడంతో ఆయనకు చార్జిమెమో జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పలాస నుంచి ఇచ్ఛాపురం వరకు అన్ని మండలాల్లో పారిశుధ్యం మెరుగుపడాల్సి ఉందన్నారు. నెలలో రెండువారాలు పారిశుధ్యం మెరుగుపర్చితే చాలు ఎంతో మార్పు కనిపిస్తుందన్నారు. చెత్తసంపద కేంద్రాలను (మిగతా 8వ పేజీలో..)



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్, పక్కన ఎమ్మెల్యే అశోక్

విద్యుత్ చార్జీలు తగ్గిస్తున్నాం

● మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి రూరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీలతో పాటు నిత్యావసరాల ధరలను పెంచితే కూటమి ప్రభుత్వం వాటిని తగ్గిస్తుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం తన దత్తత గ్రామం బన్నువాడలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 'గత ప్రభుత్వం అప్పులు చేసి సంక్షేమ పథకాలు అమలు చేసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వైసీపీ కంటే రెట్టింపు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. నిత్యావసరాల ధరలను తగ్గిస్తున్నాం. విద్యుత్ చార్జీలకు సంబంధించి ప్రతి నెల వచ్చే బిల్లులో ట్రూడౌన్ చార్జీలను యూనిట్‌కు 13 పైసలు తగ్గిస్తున్నాం. ప్రజలకు సోలార్ విద్యుత్ రాయితీ ఇస్తాం. ఈ క్రాప్ నమోదు గడువును ఈ నెల 20 వరకు పెంచుతున్నాం. ఇచ్చిన మాట ప్రకారం ఏడాదిలోనే 64 లక్షల మందికి రూ.34వేల కోట్లు వెచ్చించి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందిస్తున్నాం. సూపర్ సిక్స్ పథకాలతో పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాం. అన్నదాత సుఖీభవ కింద మొదటి విడత డబ్బులు జమకాని రైతులు సచివాలయంలో దరఖాస్తులు చేసుకోవాలి. పోర్టు (మిగతా 8వ పేజీలో..)



బన్నువాడలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

రేపటి నుంచి కొత్త టీచర్లకు శిక్షణ

గుజరాతీపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025ద్వారా ఎంపికైన కొత్త ఉపాధ్యా యులకు శుక్రవారం నుంచి ఈ నెల 10వరకు శిక్షణ తరగతులు నిర్వహించ నున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. బోధనా పద్ధతులు, తరగతి గది నిర్వహణ, పాఠ్య విధానాలపై అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందన్నారు. తెలుగు, హిందీ, ఒరియా, ఇంగ్లీషు కొత్త టీచర్లకు గ్లోబల్ జూనియర్ కళాశాల (ఆదివారంపేట), బయోలాజికల్ సైన్స్, గణితం ఉపాధ్యాయులకు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (వాడాడ జంక్షన్, అరసవల్లి), ఫిజికల్ ఎడ్యుకేషన్, సోషల్ స్టడీస్ టీచర్లకు మహాలక్ష్మి నిలయం ఓల్డ్ హాస్టల్ (గొంటి వీధి, ప్రకాశ్‌నగర్ కాలనీ) ఫిజికల్ సైన్స్, ఎస్జీటీ ఉపాధ్యాయులకు విశ్వవిజేత జూనియర్ కళాశాల (మహాలక్ష్మీనగర్ కాలనీ) కేంద్రాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఉదయం ఏడు గంటలకే శిక్షణ కేంద్రాల్లో రిపోర్టు చేయాలని స్పష్టం చేశారు. అన్ని ఏర్పాట్లు చేశామని, మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

పీహెచ్‌సీ వైద్యాధికారులకు న్యాయం చేయాలి

●డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ధర్నా

అరసవల్లి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారుల సమస్యలను పరిష్కరించి, వారికి న్యాయం చేయాలని ఆ అసోసియేషన్ జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా వారు స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఏడురోడ్ల జంక్షన్ వరకు నల్ల బెలూన్లు చేతబూని, నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 20 ఏళ్లకు పైగా పీహెచ్‌సీ వైద్యులు ఎటువంటి పదోన్నతులు లేకుండా పనిచేస్తున్నారని, ఇది అన్యాయమని పేర్కొన్నారు. నాలుగేళ్ల సర్వీసు దాటిన వారికి ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇన్ సర్వీస్ పీజీ కోటాను 30 శాతానికి పెంచాలని, పక్కనున్న (మిగతా 8వ పేజీలో..)



ధర్నా చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

పలాసలో కేంద్రీయ విద్యాలయం

●ఉద్దానం ప్రాంతానికి మంచి అవకాశం

కాశీబుగ్గ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దేశవ్యాప్తంగా 57 విద్యాలయాలు మంజూరు చేస్తూ కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదముద్ర వేసింది. తెలుగు రాష్ట్రాలకు 8 మంజూరు కాగా ఏపీకి నాలుగు కేంద్రీయ విద్యాలయాలు కేటాయించింది. ఇందులో భాగంగా పలాసలో ఒకటి ఏర్పాటుకు ఆమోదముద్ర వేసింది. దేశవ్యాప్తంగా కేంద్రీయ విద్యాలయాలకు రూ.5862 కోట్లు అవసరమని కేంద్ర కేబినెట్ భావిస్తోంది. ఈ లెక్కన పలాస విద్యాలయానికి రూ.102 కోట్లు రావొచ్చు. 1,520 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించే అవకాశముంది. టీచింగ్, నాన్ టీచింగ్ దాదాపు 80 మందికిపైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కవచ్చు. ఎమ్మెల్యే గౌతు శిరీష ఆధ్వర్యంలో ఇప్పటికే పలాస సూదికొండ ప్రాంతంలో 12 ఎకరాల భూమిని సేకరించారు.

మహిషాసుర మర్దినిగా దుర్గమ్మ 8లో

శునకాన్ని కాపాడేందుకు..
● నాగావళి నదిలో చిక్కుకున్న వైనం
● రంగంలోకి అగ్నిమాపక సిబ్బంది
● చివరికి క్షేమంగా ఒడ్డుకు..
8లో

బెలూన్లు అమ్మడానికి వచ్చి..

● రిటైర్డ్ హెచ్‌ఎం ఇంటిలో దొంగతనం
● కేసును ఛేదించిన పోలీసులు
● హిజ్రా అరెస్టు.. మరో ముగ్గురి కోసం గాలింపు
● 12.75 తులాల బంగారం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జి డీఎస్పీ లక్ష్మణరావు

పలాస, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బెలూన్లు అమ్ముకోవడానికి వచ్చిన ఓ ముఠా ఓ రిటైర్డ్ హెచ్‌ఎం ఇంటిలో దొంగతనానికి పాల్పడింది. ఇంటిలో ఎవరూ లేని సమయంలో తాళాలు విరగ్గొట్టి 25 తులాల బంగారాన్ని అపహరించింది. ఈ కేసును పోలీసులు ఛేదించారు. కవిటి గ్రామానికి చెందిన ఓ హిజ్రాను అరెస్టు చేసి 12.75 తులాల బంగారం రికవరీ చేశారు. మరో ముగ్గురు నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ వివరాలను కాశీబుగ్గ ఇన్‌చార్జి డీఎస్పీ లక్ష్మణరావు బుధవారం సాయంత్రం స్థానిక సబ్‌డివిజన్ పోలీసు కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. కంచిలిలో నివాసం ఉంటున్న రిటైర్డ్ లెక్చరర్ పి.సింహాద్రిప్రధాన్ ఈ ఏడాది జూలై 5న విదేశాల నుంచి వస్తున్న తన కుమారుడు, కోడలును రిసీవ్ చేసుకోవడానికి విశాఖపట్నం వెళ్లారు. మరుసటి రోజు వారు ఇంటికి చేరుకోగా, తాళాలు విరగ్గొట్టి ఉన్నట్లు గుర్తించి కంచిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీరువాలో 25 తులాల బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్ఐ పారినాయుడు కేసు నమోదు చేశారు. సోంపేట సీఐ మంగరాజు ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం సీఐకు వచ్చిన సమాచారం మేరకు కంచిలి రైల్వేస్టేషన్ వద్ద కవిటి గ్రామానికి చెందిన నాగుల సోనియా అనే హిజ్రాను అదుపులోకి తీసుకున్నారు. సోనియా వద్ద ఉన్న కవర్‌ను తనిఖీ చేయగా బంగారం, వెండి ఆభరణాలు బయటపడ్డాయి. తమదైన శైలిలో పోలీసులు విచారణ చేపట్టడంతో అసలు విషయం వెలుగుజూసింది. కంచిలి కంచెమ్మ ఆలయం (మిగతా 8వ పేజీలో..)



గార: శ్రీకూర్మ క్షేత్రంలో శ్రీవైష్ణవీ దుర్గ



ఆమదాలవలస: సరస్వతీదేవిగా అమ్మవారు



ఇచ్ఛాపురం: స్వేచ్ఛావతి అమ్మవారికి పూజలు



కాశీబుగ్గ: ప్రత్యేక అలంకరణలో దుర్గామాత



ఇచ్ఛాపురం: మహిషాసురమర్దినిగా అమ్మవారు

మహిషాసుర మర్దినిగా దుర్గమ్మ

దుర్గా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారు బుధవారం మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. వివిధ గ్రామాల్లో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ దేవాలయాల్లో అమ్మవారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

-ఆంధ్రజ్యోతి బృందం



నందిగాం: దుర్గాదేవికి 126 రకాల నైవేద్యాలు సమర్పించిన దృశ్యం



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో లలితా సహస్ర నామ పారాయణంలో భక్తులు



హరిపురం: మహాచండీ హోమం నిర్వహిస్తున్న వేదపండితులు



నరసన్నపేట: మాకివలసలో దుర్గాదేవి మండపం వద్ద పూజలు చేస్తున్న మహిళలు



గార: సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



పాతపట్నం: మహిషాసుర మర్దిని అలంకరణలో నీలమణిదుర్గ

విద్యుత్ చార్జీలు తగ్గిస్తున్నాం

(7వ పేజీ తరువాయి)

రోడ్లకు సంబంధించి అండర్ పాసేజ్‌కు రూ.15 కోట్లు మంజూరు చేశాం.' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బగాది శేషగిరిరావు, టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, పీఆర్‌ఈఈ సుధాకర్, వ్యవసాయశాఖ జేడీ త్రినాథ్‌స్వామి, ఏడీ జగన్‌మోహన్‌రావు, ఎంపీడీవో రేణుక, డీఎస్పీ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

బెలూన్లు అమ్మడానికి వచ్చి..

(7వ పేజీ తరువాయి)

వద్ద యాచిస్తూ పొట్టపోషించుకుంటున్న సోనియాకు మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌కు చెందిన బాబు, ఔరంగాబాద్‌కు చెందిన కబాడియా, సనాటా, టున్ని అనే నలుగురు వ్యక్తులు పరిచయమయ్యారు. ఈ నలుగురూ గ్రామాల్లో తిరుగుతూ బెలూన్లు అమ్ముతుంటారు. బెలూన్లు అమ్మితే రోజుకు రూ.50 కూడా మిగలడం లేదని, దొంగతనం చేసి ఒక్కసారిగా డబ్బులు సంపాదించాలని వీరంతా అనుకున్నారు. వీరికి సోనియా సహకరించింది. ఈ క్రమంలో రిటైర్డ్ లెక్చరర్ సింహాద్రిప్రధాన్ ఇంటిలో చోరీకి పాల్పడ్డారు. దొంగిలించిన బంగారంలో కొత్త భాగం సోనియా బరంపూర్‌లో అమ్మడానికి వెళ్తున్న క్రమంలో పోలీసులకు పట్టుబడింది. 12.75 తులాల బంగారం స్వాధీనం చేసుకుని సోనియాను అరెస్టు చేశామని, మిగిలిన వారికోసం గాలిస్తున్నట్లు డీఎస్పీ డీఎస్పీ తెలిపారు. కేసు మిస్టరీ ఛేదించిన సీఐ, ఎస్ఐతో పాటు ఏఎస్ఐలు రామారావు, రూప్‌కుమార్, హెడ్ కానిస్టేబుళ్లు కోదండ, శ్రీనివాస్, కానిస్టేబుల్ షణ్ముఖరావును అభినందించారు. వీరికి రివార్డులు అందిస్తామని తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యం



కిష్టప్పపేటలో పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యమని శ్రీకాకుళం రూరల్ మండలంలోని కిష్టప్పపేట, గేదెలవానిపేట గ్రామాలలో బుధవారం పింఛను పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు అధికారులు కలిసి పని చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో శ్రీకాకుళం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మొదటి స్థానంలోకి నిలుపుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం గ్రామాల్లోని దేవి మండపాలను సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.ప్రకాశ్‌రావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ప్రయోజనం

- పీయూసీ చైర్మన్ కూన రవికుమార్

పొందూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో రాష్ట్రంలో



దివ్యాంగునికి పింఛను పంపిణీ చేస్తున్న రవికుమార్

పేదలకు ఏడాదికి కనీసం రూ.10 వేల ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. కోటిపల్లి, మజ్జిలపేట గ్రామాలలో బుధవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నిత్యావసర ధరలతో పాటు మందులపై జీఎస్టీ తగ్గుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీమేరకు విద్యుత్‌చార్జీలు తగ్గించినట్టు తెలిపారు. పింఛనును రూ.1000 పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ కూన సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు సీహెచ్ రామ్మోహన్, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కర్, మాజీ సర్పంచ్ గురుగుబెల్లి జనకచక్రవర్తి, మాజీ ఎంపీటీసీ సువ్వారి రమణ, నీటిసంఘం నాయకులు ఇందుధరుడు, నాయకులు జి.శివశంకర్, ఎంపీడీవో ఎస్. వాసుదేవరావు, ఈవోఆర్‌డీ పి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు..

ప్రజలను మోసగించిన వైసీపీ

- పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం/రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం పింఛన్ల విషయంలో ప్రజలను మోసగించిందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆరోపించారు. బుధవారం మండలంలోని తీమరలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటో తేదీన పింఛన్ పెంచి అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు.



పాతపట్నం రూరల్: పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

శుద్ధజల కేంద్రాలు తెరిచేదెప్పుడు?

(7వ పేజీ తరువాయి)

కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం మండలాల్లో ఒక్కొక్క మదర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఏడు మండలాల్లోని మదర్ ప్లాంట్ల నుంచి 135 గ్రామాల్లోని సరఫరా కేంద్రాలకు ట్యాంకర్లతో (స్టీల్ కంటైనర్లు) శుద్ధ జలాలను తరలించేవారు. ఇక్కడ 20 లీటర్ల నీటిని రూ.2కే ప్రజలకు అందించేవారు. కొన్నాళ్ల పాటు ఇవి బాగానే పనిచేశాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వీటి నిర్వహణను గాలికొదిలేసింది. నిర్వహణ వ్యయం పేరిట 20 లీటర్ల నీటి క్యాన్‌ను రూ.7కు పెంచింది. ఒక కుటుంబానికి రోజుకు సగటున మూడు క్యాన్లు అవసరం. అంటే తాగునీటికి రోజుకు రూ.21 ఖర్చుచేయాల్సి వచ్చేది. తరువాత ఉద్దానం సమగ్ర మంచినీటి పథకం అంటూ హడావుడి చేసిన జగన్ ప్రభుత్వం శుద్ధజల కేంద్రాలను పూర్తిగా పట్టించుకోవడం మానేసింది. దీంతో ప్లాంట్లన్నీ మూతపడ్డాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్టీఆర్ సుజలధారపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు శుద్ధజల కేంద్రాల నిర్వహణకు రూ.5.75 కోట్లు కేటాయించింది. ఈ నిధులను తక్షణమే మంజూరు చేసి శుద్ధజల కేంద్రాలను తెరిపించాలని ఉద్దానం ప్రజలు కోరుతున్నారు.

అన్ని కేంద్రాలు తెరుస్తాం..

ఉద్దానం ప్రజలకు శుద్ధ జలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం. అన్ని శుద్ధజల కేంద్రాలను అందుబాటులోకి తెస్తాం. ఎక్కడైనా ప్లాంట్లు పాడైతే ఫిర్యాదు చేయాలి. వెంటనే బాగుచేయిస్తాం.

తాగునీటి సరఫరా బాధ్యత అధికారులదే

(7వ పేజీ తరువాయి)

వినియోగంలోకి తీసుకురావాలని, అలా చేయకుంటే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కవిటి మండలంలో రీసర్వే తర్వాత జిరాయితీ భూములు ప్రభుత్వ ఖాతాల్లో చూపిస్తున్నాయని, జాయింట్ ఎల్‌పీ నెంబర్లు వచ్చి రైతులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి పలువురు తీసుకువెళ్లారు. ఈ సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఇచ్ఛాపురం మండలం మండపల్లి పంచాయతీలో అధికారులకు చెక్ పవర్ ఇస్తే సర్పంచ్‌తో కలసి అక్రమంగా నిధులు డ్రాచేయటంపై సమగ్ర నివేదికను అందించాలని డీపీవో భారతీ సౌజన్యను ఆదేశించారు. డ్వామా పీడీ సుధాకర్, పలాస ఆర్డీవో జి.వెంకటేష్,ఈఈ శంకర్‌బాబు, డీఈఈలు గోపాలకృష్ణ,ఆశాలత, సూర్యప్రకాష్, ఎంపీడీవో ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

వ్యవసాయరంగానికి జీఎస్టీ ఊతం..

ప్రభుత్వం జీఎస్టీ ధరలను తగ్గించడంతో వ్యవసాయరంగానికి ఊతంలభించిందని కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కవిటిలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్, రైతులతో కలసి ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్నారు. ఇచ్ఛాపురం రైతుసంఘానికి డ్రోన్‌ను అందించారు. అంతకు ముందు బల్లిపుట్టుగలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ గ్రామంలో రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం: మంత్రి అచ్చెన్న

టెక్కలి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మానవాళిలో ఆధ్యాత్మిక చింతన అవసరమని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. బుధవారం టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో దుర్గాశరన్నవరాత్రి పూజల్లో ఆయన పాల్గొని భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. టెక్కలి ప్రాంతంలో భవానీ, అయ్యప్ప భక్తులకు శాశ్వత వసతి ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. తొలుత స్ఫటిక లింగానికి అభిషేకాలను నిర్వహించారు. అలాగే స్థానిక జగతిమెట్ట వద్ద రెవెన్యూశాఖ నిర్వహించే ఐవోసీ ఫిల్లింగ్ స్టేషన్‌ను మంత్రి శంకుస్థాపన చేశారు. కాగా టెక్కలిలో కోర్టు సముదాయానికి అవసరమైన భవనాలు నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేయాలని టెక్కలి బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు మంత్రిని కోరారు.ఈ మేరకు బార్ అసోసియేషన్ అధ్యక్షులు పినకాన అజయ్‌కుమార్, న్యాయవాదులు దివ్వల వివేకానంద, సాయిరాజ్, ఆనంద్, రాజన్నాయుడు, వైకుంఠరావు, మలేసు, రాజేష్, వెంకటరమణ మంత్రిని కలిశారు. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ బగాది శేషగిరి, ఎల్ఎల్ నాయుడు, లవకుమార్, సుందరమ్మ, దమయంతి, రామకృష్ణ, కామేసు, కింగ్, రాము ఉన్నారు.

వేలిముద్రలు పడక.. కళ్లు స్కాన్ కాక

- లోకొండ గ్రామానికి చెందిన వృద్ధుడికి అందని పింఛన్
- వృద్ధాప్యంలో ఆదరణకు నోచుకోని వైనం



పెద్దింటి రామయ్య

హిరమండలం, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోకొండ గ్రామానికి చెందిన 90 ఏళ్ల గిరిజన వృద్ధుడు పెద్దింటి రామయ్యకు సాంకేతిక కారణాలతో పింఛన్ అందడంలేదు. నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తొలిసారిగా అమలు చేసిన సామాజిక పింఛన్ మంజూరయ్యింది. మొదటి సారిగా రూ.35 తీసుకొని అప్పటి నుంచి పింఛన్ అందుకునేవాడు. చివరకు రూ.2000 వరకు పింఛన్ అందకునేవాడు. అయితే వృద్ధాప్యం వల్ల వేలిముద్రలు పడకపోవడం,కంటి చూపు స్కాన్ మిషన్ తీసుకోకపోడంతో నాలుగేళ్లుగా పింఛన్ అందడంలేదు. రామయ్య భార్య చాలా ఏళ్ల కిందట మృతి చెందింది.ఇద్దరు పిల్లలు ఉన్నా ఆదరణకు నోచుకోవడంలేదు. కుమార్తెకు వివాహం కావడంతో అత్తారింటికి వెళ్లిపోయింది. 20 సంవత్సరాల కిందట కుమారుడికి వివాహంకావడంతో వేరేగా ఉంటున్నాడు. ఆదరణ లేక, పింఛన్ సొమ్ము కూడా అందకపోవడంతో బతుకుభారంగా మారింది. ఆర్థిక ఇబ్బందుల వల్ల తనకు మరణమే శరణ్యమని రామయ్య రోదిస్తున్నాడు. పలుసార్లు గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండాపోయిందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పింఛన్ అందజేయాలని పలువురు కోరుతున్నారు.

శిరీష కృషి వల్లే కేంద్రీయ విద్యాలయం

- టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు

కాశీబుగ్గ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) పలాసకు కేంద్రీయ విద్యాలయం ఎమ్మెల్యే గౌతు శిరీష కృషి వల్లే మంజూరయ్యిందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు తెలిపారు. బుధవారం కాశీబుగ్గలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు అహర్నిశలు కష్టపడ్డారన్నారు. పలాసకు ఎలాగైనా కేంద్రీయ విద్యాలయం తీసుకురావాలని గౌతు శిరీష తపన నేరవేరిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గౌతు శిరీష అభివృద్ధిపై దృష్టి సారించారని తెలిపారు. అసెంబ్లీలో పలాస సమస్యలపై లేవనెత్తి పరిష్కారానికి కృషి చేస్తు న్నారని తెలిపారు. వైసీపీ హయంలో మాటలకే పరిమితమని, వారు వేసినవి పునాది రాళ్లు కాదని, సమాది రాళ్లని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు గతంలో కక్షసాధింపు చర్యలకు పాల్పడడం తప్పా అభివృద్ధిపై దృష్టి పెట్టలేదని ఆరోపించారు. సమావేశంలో నాయకులు సూర్యనారాయణ, కూర్మారావు, డి నర్సింహులు, నాగరాజు, శ్రీహరి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లొడగల కామేశ్వరరావు

ఓటు చోరీపై లక్ష సంతకాల సేకరణే లక్ష్యం

అరసవల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఓటు చోరీపై శ్రీకాకుళం జిల్లాలో లక్ష సంతకాల సేకరణ లక్ష్యంగా పని చేస్తున్నామని కేంద్ర మాజీమంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి అన్నారు. స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో బుధ వారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిహార్, హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ఓటు చోరీ జరిగిందని అన్నారు. ఈ విషయాన్ని రాహుల్ గాంధీ ఆధా రాలతో సహా నిరూపించారని అన్నారు. ఇదే విషయమై ఎలక్షన్ కమిషన్‌ను ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సింది పోయి, తిరిగి రాహుల్ గాంధీని అఫిడ విట్ దాఖలు చేయాలని అడగడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది ప్రజాస్వా మ్యాన్ని కాలరాయడమే అని అన్నారు. ఆమె తొలి సంతకం చేసి కార్యక్ర మాన్ని ప్రారంభించారు. దీనికి సంబంధించి పార్టీ నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి గాదం వెంకట త్రినాథ రావు, డా.కె.రామ్మోహనరావు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్‌కుమార్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మధుసూదనరావు, అన్నాజీరావు, నగర యువత అధ్యక్షుడు సురేష్, మహేష్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారులకు న్యాయం చేయాలి

(7వ పేజీ తరువాయి)

తెలంగాణ రాష్ట్రంలో కూడా 30 శాతం కోటా అమల్లో ఉందని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు 50శాతం మూలవేతనం భత్యం గా ఇవ్వాలని, అన్ని దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీ వైద్యులందరూ ఎమర్జెన్సీ విధులను కూడా బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. వైద్యులు ప్రతిష్ఠ, మౌని, సుధీర్, పావని, నవీన్, సుమ, శ్రీనాథ్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మత్తు వైద్యులను నియమించండి



వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

సోంపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆస్పత్రులలో మత్తు వైద్యులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని..వీరిని నియమించేందుకు చొరవ చూపాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఎమ్మెల్యే అశోక్ కోరారు. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి, డయాలసిస్ కేంద్రాన్ని ఎమ్మెల్యేతో కలసి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఆసుపత్రుల్లో మత్తు వైద్యులు లేకుంటే బయటి నుంచి తెచ్చుకొనేందుకు కొంత నిధిని కలెక్టర్ ఆధ్వర్యంలో ఆసుపత్రుల్లో నిల్వ ఉంచేవారని తెలిపారు. ప్రస్తుతం అది కనిపించడం లేదన్నారు. డయాలసిస్ కేంద్రానికి వచ్చే బాధితులు వేచి ఉండేందుకు సరైన భవనం లేక పాకలో ఉంటున్నారని తెలిపారు. భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. రాత్రివేళల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు.

పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి..

డయాలసిస్ కేంద్రంలో పారిశుధ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరడంతో కలెక్టర్ స్పందించారు. పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ ఉన్న బెడ్లను చూపిస్తూ కనీసం తుడవడం లేదన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను పిలిచి పారిశుధ్యం బాగా లేనప్పుడు సంతకాలు ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. ఇక నుంచి పరిశుభ్రంగా లేకపోతే రిమార్కు రాయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేష్, జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు.

శునకాన్ని కాపాడేందుకు..

- నాగావళి నదిలో చిక్కుకున్న వైనం
- రంగంలోకి అగ్నిమాపక సిబ్బంది
- చివరికి క్షేమంగా ఒడ్డుకు..



రణస్థలం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): అనగనగా ఓ శునకం. ఆహారాన్ని వెదుక్కుంటూ బుధవారం శ్రీకాకుళంలోని ఏడు రోడ్ల జంక్షన్ సమీపంలో నాగావళి నదిలోకి వెళ్లింది. ఇంతలో ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగింది. దీంతో నది మధ్యలో ఓ రాయిపై ఆ వీధి కుక్క ఉండిపోయింది. వరద ప్రవాహం పెరుగుతుండడంతో ఏం చేయాలో పాలుపోక అక్కడే అచేతనంగా ఉండిపోయింది. వంతెనపై నుంచి దీనిని చూసి గుర్తించిన స్థానికులు ఆ కుక్కను కాపాడే ప్రయత్నం చేశారు. శ్రీకాకుళం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఏడీఎఫ్ఓ కె.శ్రీనుబాబు ఆధ్వర్యంలో సిబ్బంది రంగంలోకి దిగారు. బోటుతో నదిలోకి వెళ్లారు. ఎల్ఎఫ్ షణ్ముఖరావు, ఫైర్ సిబ్బంది రామచంద్ర నాయుడు, మరికొంత మంది సాయంతో మూడు గంటల పాటు శ్రమించి మూగజీవాన్ని కాపాడారు. వందలాది మంది జనం ఈ రెస్క్యూ ఆపరేషన్‌ను వంతెనపై నుంచి తిలకించారు.



కుక్కను కాపాడిన ఫైర్ సిబ్బంది

శిక్షణతో విద్యార్థులకు ప్రయోజనం

కంచిలి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఆచరణాత్మక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకే ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోందని ఎంఎస్‌పల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివప్రసాద్ అన్నారు. గత పది రోజుల నుంచి ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఐటీ రంగాన్ని ఎంచుకున్న విద్యార్థులకు ఏడాదిలో మూడుసార్లు ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జిల్లా అధికారులు, జీఎస్టీ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలు ఈ విషయమై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా అధికారులు, జీఎస్టీ అధికారులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులు తగ్గుదల:డీఎంహెచ్‌వో

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణల కారణంగా వైద్య చికిత్సలు, మందులు, వైద్య పరికరాల ధరలు ప్రజలకు మరింత అందుబాటులోకి వచ్చాయని, ఖర్చులు తగ్గనున్నాయని డీఎంహెచ్‌వో డా.కె.అనిత ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నారుల కోసం వినియోగించే డైపర్లు, నాప్‌కిన్లు, లైనర్లు, ఫీడింగ్ బాటిల్స్ వ్యక్తిగత ఆరోగ్య బీమా వంటి వాటిపై జీఎస్టీని తగ్గించినట్లు తెలిపారు. వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది, గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి జీఎస్టీ సంస్కరణలతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

ఆక్వా రైతులకు ప్రయోజనం



మాట్లాడుతున్న డీడీ సత్యనారాయణ

ఎచ్చెర్ల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో ఆక్వా రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ వై.సత్యనారాయణ అన్నారు. కుప్పిలి, బుడగట్లపాలెం గ్రామాల్లోని ఆక్వా రైతులకు జీఎస్టీ 2.0పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీఎస్టీ 2.0తో ఆక్వాకు సంబంధించిన ఉపకరణాల కొనుగోలు, తగ్గింపు, మిగులు తదితర వాటిని వివరించారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు, ఎఫ్‌డీవో కె.రవికుమార్, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు చీకటి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు

రణస్థలం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయడు విజయనగరం జిల్లాకు వచ్చిన సందర్భంగా బుధవారం శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పిన్నింటి భానోజీనాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దివంగత నేత ఎన్‌టీ రామారావు జీవిత చరిత్ర పుస్తకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సమర్పించారు. ఆయనతో పాటు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఉన్నారు.

అలరించిన హరేరామ కీర్తనలు

సోంపేట రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా మహోత్సవాల సందర్భంగా ఎ ర్ర ముక్కాంలో బుధవారం రాత్రి నిర్వహించిన హరేరామ, హరే కృష్ణ కీర్తనలు అలరించాయి. కపాసుకుద్ది గ్రామానికి చెందిన గోవిందస్వామి ఆధ్వర్యంలో శ్రీకృష్ణచైతన్య భజన బృంద సభ్యులు ఈ కీర్తనలు ఆలపించారు.

యువత శ్రమదానం

గార రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వమరవల్లికి చెందిన యువత బుధవారం శ్రమదానంతో సీఎస్పీ రోడ్డు నుంచి వమరవల్లి జంగిల్ క్లియరెన్స్ చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, తుప్పలు ఎక్స్‌కవేటరతో తొలగించారు.

ఎయిడ్స్‌ను తరిమికొడదాం

ఇచ్ఛాపురం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ మహమ్మారిని తరిమి కొడదామని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.దేవేంద్రరెడ్డి అన్నారు. సీహెచ్‌సీలో వైసీబీ ట్రక్కర్ ప్రాజెక్ట్ ఆధర్యంలో బుధవారం ఐఈసీ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనూష, శిల్ప, రమేష్ నాయుడు, ఐసీటీసీ కౌన్సిలర్ రాజశేఖర్, ఎల్‌టీ మోహన్, వెంకటరాజు, హెల్త్ ఎడ్యుకేటర్స్ రవి, హసన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బైరి గ్రామ పంచాయతీలో బుధవారం ఉదయం జడ్పీ సీఈవో డి.సత్య నారాయణ పర్యటించారు. ఐవీ ఆర్ఎస్ కాల్స్‌కు అందిన ఫిర్యాదుల మేరకు పారిశుధ్య పనుల తీరును పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణపై గ్రామస్థులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.ప్రకాశరావ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

కవిటి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): బల్లిపుట్టుగ గ్రామంలోని పిల్లివీధికి చెందిన వారు ఎమ్మెల్యే బి.అశోక్ ఆధ్వర్యంలో బుధవారం టీడీపీలో చేరారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఖీరోమణి, హరిబందుల ఆధ్వర్యంలో 30 కుటుంబాల వారు పార్టీలో చేరారు. వీరికి కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బి.చిన్నబాబు, మండల పార్టీ అధ్యక్షుడు పి.కృష్ణారావు, నేతల సమక్షంలో కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మణిచంద్రప్రకాష్, పీఏసీఎస్ చైర్మన్ బాసుదేవ్ ప్రదాన్, రైల్వే బోర్డు సభ్యుడు రంగా రౌళో, పాండు దొళాయి, వి.సునీల్, బి.రమేష్, సంతోష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

అందుమూలముగా నా క్లయింటు M/s SHRIRAM FINANCE LIMITED రణస్థలం బ్రాంచి రణస్థలం ఇచ్చిన లోగట్టా ప్రకారము యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలులో చూపిన స్థిరాస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని శ్రీ/శ్రీమతి వద్దాది సురేష్ S/o లేటు వద్దాది రాఘవరావు వీరి యొక్క ప్రాపర్టీని షూరిటీగా తీసుకొని వీరికి ఋణము యిచ్చుటకు నిర్ణయించుకొన్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైనను ఎటువంటి జప్తులు, చార్జీలు, క్రయాములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న ఎడల నేటి నుండి ఏడు దినములలో ఈ క్రింది చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియచేయగలరు. తదుపరి అభ్యంతరములకు నాక్లయింటు భాధ్యులుకారు.

షెడ్యూలు : శ్రీకాకుళం జిల్లా, రణస్థలం సబ్.డి., రణస్థలం మండలం, రణస్థలం పంచాయితీ, రణస్థలం రెవెన్యూ గ్రామ లెక్కదాఖలా సర్వే నెం. 60 రులో గల ఖాళీస్థలంనకు కొలతలు వివరములు: స్థలం కొలతలు: తూ॥హ॥కు ఉత్తర దండి 25అ॥, తూ॥హ॥లకు దక్షిణ దండి 24అ॥, ఉ॥ద॥లకు తూర్పు దండి 27అ॥, ఉ॥ద॥లకు పడమర దండి 27అ॥, అనగా 73.5చ॥గ॥ లేక 361.74చ॥మీ॥ **హద్దులు : తూ:** చండక అప్పారావు ఖాళీస్థలం మరియు దాబాయిల్లు, **ప:** సి.సి.రోడ్డు, **ఉ:** రేస్తా, **ద:** మామిడిపాక శ్రీనివాసరావు ఖాళీస్థలం,

టి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్
డోర్ నెం.11-6-59, కొల్లా వారి వీధి, శ్రీకాకుళం
సెల్: 9247315759

15వ తేదీ వరకు గాలి కుంటువ్యాధి నివారణ టీకాలు

పాతపట్నం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బైదలాపురంలో బుధవారం గాలికుంటువ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ ఏడీ మంచు కరుణాకరావు తెలిపారు. ఈనెల 15వతేదీతో గాలికుంటువ్యాధి నివారణా టీకాలు వేసే కార్యక్రమాన్ని పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది దొర గుణాలమ్మ, ఇప్పిలి రామ్మోహనరావు, ఎర్రిబోతు వల్లభరావు, జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

వేర్వేరు ఘటనల్లో బుధవారం జిల్లాకు చెందిన నలుగురు మృతి చెందారు. దీంతో ఆయా గ్రామాల్లో విషాధం నెలకొంది.

దసరాకు వస్తుండగా సీమెన్..

నరసన్నపేట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):నరసన్నపేట జమ్ము జంక్షన్ వద్ద జాతీయరహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సీమెన్ దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. ముంబైలో సీమెన్‌గా విధులు నిర్వహిస్తున్న కంబాలరవిబాబు(37)దసరాకు స్వగ్రామం వచ్చేందుకు ఫ్లైట్‌లో విశాఖలో దిగాడు. అనంతరం స్టీల్ ప్లాంట్ క్వార్టర్స్‌లో ఉంటున్న తల్లిదండ్రులు నరసయ్య, కామాక్షి ఇంటికి మంగళవారం చేరాడు. విశాఖపట్నం నుంచి స్వగ్రామం వజ్రపుకొత్తూరు మండలంలోని హుకుంపేటకు ద్విచక్రవాహనంపై బుధవారం తెల్లవారుజామున బయలుదేరాడు.జమ్ము జంక్షన్ వద్ద దిచక్ర వాహనం అదుపు తప్పి తలకు బలమైన గాయాలుకావడంతో అక్కడిక్కడే మృతిచెందాడు.స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి ఎస్‌ఐ దుర్గాప్రసాద్ చేరుకుని పరిశీలించారు. దసరాకు ఇంటికి వస్తున్న తరుణంలో ప్రమాదంలో మృతిచెందడంతో భార్య భారతి కన్నీరుమున్నీరుగా రోదిస్తోంది.రవిబాబు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.


రవిబాబు (ఫైల్)

ద్విచక్రవాహనంపై నుంచి పడి..

పాతపట్నం/రూరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రాపురం సమీపంలో ద్విచక్రవాహనంపై నుంచిపడి బుధవారం ఉదయం ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడని ఎస్‌ఐ కె.మధుసూదనరావు తెలిపారు. ఎస్‌ఐ, కుటుంబసభ్యుల కథనం మేరకు.. సారవకోటకు చెందిన అడపా ఈశ్వరరావు(36)గ్యాస్‌ఏజెన్సీలో డెలివరీబాయ్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఇంటి నుంచి డ్యూటీ కోసం వెళ్తున్నానని చెప్పి బయలుదేరినా విధులకు కూడా హాజరుకాలేదు. మంగళవారం సాయంత్రం నుంచి కుటుంబసభ్యులతో ఫోన్‌లో సంభాషిస్తున్నాడు.తాను ఇంటికి వచ్చేస్తానని చెప్పినాచేరలేదు. ఇంతలో రామచంద్రాపురం గ్రామస్తులు రోడ్డుపై ద్విచక్రవాహనంపై నుంచిపడడంతో ఓ వ్యక్తి మృతిచెందినట్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు బుధవారం ఉదయం ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఈశ్వరరావుగా గుర్తించి అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. కాగా ఈశ్వరరావు భార్య సుజాత బుధవారం ఇచ్చిన ఫిర్యాదుమేరకు పాతపట్నం ఎస్‌ఐ కేసునమోదుచేశారు.


ఈశ్వరరావు (ఫైల్)

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒకరు..

జలుమూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలతరియా గ్రామానికి చెందిన దండుపాటి గడ్డెయ్య (56) విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు... గతనెల 16న ఇంటివద్ద మెట్లు దిగుతూ జారిపడిన గడ్డెయ్యకు తలకు బలమైన గాయమయ్యింది.దీంతోమెరుగైన చికిత్సకోసం కేజీహెచ్‌కి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. గడ్డెయ్యకు భార్య యశోద, కుమారుడు రామన్న ఉన్నారు. గడ్డెయ్య తమ్ముడుఅప్పన్న ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసినట్లు ఎస్‌ఐ బి.అశోక్‌బాబు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని..

భోగాపురం,అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): లావేరు మండలంలోని లక్ష్మీపురానికి చెందిన ఓ వ్యక్తి చికిత్సపొందుతూమృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. లావేరు మండలం లక్ష్మీపురానికి చెందిన భార్యాభర్తలు విశాఖ జిల్లా మదురవాడ సమీపంలో నివాసముంటున్నారు. కుమారుడు భవానీ మాలధరించడంతో ఇరుముడులు కార్యక్రమానికి మంగళవారంలక్ష్మీపురంవెళ్లారు.అక్కడి నుంచి బుధవారం దసరా పురస్కరించుకుని ఎలక్ట్రానిక్ వస్తువులు షాపింగ్‌చేసి ద్విచక్రవాహనంపై శ్రీకాకుళంవైపు నుంచి విశాఖ వైపు వెళ్తున్నారు. అయితే పోలిపల్లి సమీప జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది.దీంతో వారిద్దరూ రోడ్డుపై పడిపోవడంతో గాయపడ్డారు. వారిని హైవే వాహనంలో విజయనగరంలోని ఓప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ భర్త పట్టా అప్పన్న(45) మృతిచెందాడు. ఆయన భార్య అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.



వినియోగదారుల సంఘ సభ్యుడిగా సత్యనారాయణ

నరసన్నపేట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):నరసన్నపేట మండల వినియోగదారుల రక్షణ సంఘ అధ్యక్షుడు, న్యాయవాది గొండు సత్యనారాయణను కలెక్టర్ జిల్లా వినియోగదారుల రక్షణ సంఘ సభ్యుడిగా నియమించారు. ఆయన నియామకంపై పలువురు హర్షం వ్యక్తంచేశారు.

మహిళలు పంచసూత్రాలు పాటించాలి

హరిపురం, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి):డ్వాక్రా మహిళలు పంచసూత్రాలు పాటించి ఎంటర్‌ప్రెన్యూవర్లగా మారాలని ఏపీఎం పి.కూర్మారావు తెలిపారు. బుధవారం మందస వెలుగు కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకోసం ప్రత్యేకంగా అమలుచే స్తున్న ప్రభుత్వ పథకాలను గ్రామాల్లో వివరించాలని కోరారు.

ఆదివాసీలకు క్షమాపణ చెప్పాలి

జలుమూరు (సారవకోట) అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి):ఆదివాసీలకు ఎమ్మెల్యే అశోక్ బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదివాసీ రాష్ట్ర సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు వాబ యోగి డిమాండ్‌చేశారు. సారవకోటలో విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే అశోక్ శాసనసభలో అవగాహన లేకుండా మాట్లాడరన్నారు.















